# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 13-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ కు అదనపు నిధులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది**

3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

4. **ప్రపంచ రేడియో దినోత్సవాన్నిఈ రోజు జరుపుకొంటున్నాం.**

==========================

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ రాష్ట్రానికి అదనపు నిధులు సాధించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కేంద్ర బడ్జెట్ 2026-27 లో ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన భూ ఖనిజాల కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అంశంపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు.వచ్చే బడ్జెట్‌లోపు గరిష్ట కేటాయింపు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

--------------------------

తెలంగాణ వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ రోజు జరగనుంది. ఈ ఉదయం 8:00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ జరిగింది. ఇందులో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు ఉన్నాయి. మొత్తం 2,996 వార్డుల్లో అభ్యర్థుల ఎన్నికల పోటీలో ఉన్నారు ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం, ఈ నెల 16వ తేదీన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక జరగనుంది. ఓట్ల లెక్కింపుకు తెలంగాణ ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ఖమ్మం జిల్లాలో నిర్వహించే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై నోడల్ అధికారి నవీన్ బాబు మాట్లాడుతూ

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ప్రజలకు సమగ్ర వైద్య సేవలు మరింత చేరువయ్యేలా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడ ఆటోనగర్‌లో ఆయుష్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుష్ మిషన్ కింద 165 కోట్ల రూపాయలను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. ధర్మవరం, కాకినాడల్లో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఏప్రిల్ 1 నుంచి సార్వత్రిక ఆరోగ్య విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రాలుగా స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అమరావతిలోని తాడేపల్లి ఎస్సీ కార్పోరేషన్ కార్యాలయంలో సివిల్స్ ఉచిత ఆన్లైన్ శిక్షణను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెసిడెన్షియల్ సివిల్స్ శిక్షణకు అర్హత సాధించలేని అభ్యర్థులకు ఉచితంగా ఆన్ లైన్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డా. బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ కేంద్రాలను 3 నుంచి 10 కి పెంచామన్నారు. గత ఏడాది ఐఐటీ నీట్ లో సీట్లు సాధించిన 57 మంది విద్యార్దులకు ఒక్కొక్కిరికి లక్ష రూపాయల చొప్పున ఆర్దిక సాయం అందించామని మంత్రి వివరించారు.

---------------------------

ఢిల్లీ వేదికగా జరుగుతున్న కృత్రిమ మేధ సదస్సు – AI Conclave లో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి విజయ్ రామరాజు. ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్య గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా రంగంలో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం, క్లిక్కర్, చాట్ బాట్, ఏఐ ఆధారిత ముఖం గుర్తింపు. వ్యవస్థ వంటి సాంకేతికత అంశాల అమలను కేంద్ర మంత్రి అభినందించారు.

---------------------------

ప్రపంచ రేడియో దినోత్సవాన్నిఈ రోజు జరుపుకొంటున్నాం. ప్రపంచ ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలకు సంబంధించిన వివరాలను, విజ్ఞాన.. వినోద కార్యక్రమాలను ప్రసారం చేస్తూ రేడియో ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఐక్యరాజ్యసమితి 1946 ఫిబ్రవరి 13వ తేదీన రేడియోను ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ– యునెస్కో కూడా ఫిబ్రవరి 13వ తేదీని రేడియో దినోత్సవంగా నిర్వహించాలని తన 36వ సర్వ సభ్య సమావేశంలో తీర్మానించింది. రేడియో ప్రాముఖ్యం గురించి ప్రజలలో అవగాహన పెంపొందించడం, ప్రసార కర్తల మధ్య అంతర్జాతీయ స్థాయిలో సహకారాన్ని పెంచడం రేడియో దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. దేశంలో ఆకాశవాణి పేరుతో రేడియో తన వినూత్నమైన, వైవిధ్య భరితమైన కార్యక్రమాలతో నిష్పాక్షికమైన వార్తా ప్రసారాలతో ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించింది.

"రేడియో  కృత్రిమ మేధస్సు : AI అనేది ఒక సాధనం, ఒక స్వరం కాదు." అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ రేడియో దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన నిన్న శ్రీభ్రమరాంబ, మల్లికార్జునస్వామి రావణ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు  దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 23 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గుంటూరు జిల్లా తాడేపల్లి లోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి చెందిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులుతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిన్న సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన విధానాలపై శాసనమండలి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉందని, మాట్లాడే అవకాశం వస్తుందని అన్నారు. సభ్యులకు ప్రజల సమస్యలను వినిపించే వీలుందని, సమస్యలన్నింటిపై అంశాల వారీగా పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు.

---------------------------

టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, నమీబియా జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ లో 93 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన నమీబియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. అనంతరం 210 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నమీబియా 18.2 ఓవర్లకు 116 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో  93 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత పెరగడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో 35 నుంచి 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వెల్లడించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో  చలి కొనసాగుతుందని తెలిపారు.

---------------------------

వెనుకబడిన  వర్గాల జీవన ప్రమాణాలు పెంచేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను తెలంగాణలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో బడ్జెట్ అంచనాల తయారీపై బీసీ, రవాణా శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో ఉపకార వేతనాలు, వసతి గృహాల నిర్వహణ, స్టడీ సర్కిళ్లు, నైపుణ్య శిక్షణ, కల్యాణ లక్ష్మి, వివిధ సంక్షేమ పథకాలు, విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. రవాణా శాఖలో స్థలాలు ఉండి, సొంత భవనాలు లేని వాటికి సొంత భవనాలు నిర్మించేలా ప్రతిపాదనలు చేర్చాలని మంత్రి ఆదేశించారు.

======================